ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | మంగళవారం 24, నవంబర్ 2026 | పేజీలు: 4 | వెల: రూ.1



అమ్మ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు

- ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్
- సన్యాసం తర్వాత మూడేళ్లకు స్వగ్రామానికి వెళ్లిన యోగి
- కాషాయ వస్త్రాలతో తల్లి ఎదుట నిలబడి భిక్ష అడిగిన వైనం
- తనను చూసి ఆశ్చర్యపోయిన తల్లి
- సన్యాసం ఎందుకు తీసుకున్నావని ప్రశ్నించిన అమ్మ
- తన ధర్మం సన్యాసమేనని బదులిచ్చిన యోగి
- చివరకు తన నిర్ణయాన్ని గౌరవించిన తల్లి
- తొలి గురువు అమ్మేనని గుర్తుచేసుకున్న ముఖ్యమంత్రి
- తల్లి ప్రేమకు సాటిలేదని భావోద్వేగ వ్యాఖ్యలు
- కష్టాల్లో ఉన్న మహిళలకు అండగా నిలవాలని పిలుపు
- ఇటీవల కన్నుమూసిన తల్లి జ్ఞాపకాలను నెమరువేసుకున్నవైనం

2



ఆసియాలో భారత్ ప్రధాన శక్తి

- శక్తిమంతమైన దేశాల జాబితాలో మూడో స్థానం
- భారత్ ఖాతాలో మరో కీలక గుర్తింపు
- ఆసియా పవర్ ఇండెక్స్-2026లో పురోగతి\
- ప్రధాన శక్తి హోదా సాధించిన భారత్
- 40.5 పాయింట్లతో మూడో స్థానం
- గత ఏడాదితో పోలిస్తే 0.5 పాయింట్ల పెరుగుదల
- అమెరికా, చైనా తర్వాత భారత్‌కు చోటు
- ప్రాంతీయ రక్షణ భాగస్వామ్యంతో బలం
- ఆగ్నేయాసియాకు బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం
- ప్రాంతీయ నేతల్లో మోదీకి రెండో స్థానం

నేషనల్‌బ్యూరో, (ప్రజాస్వరం):

ఆసియాలో భారత్ తన శక్తిని మరింత పెంచుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన లోవీ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన ఆసియా పవర్ ఇండెక్స్2026లో 40.5 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. అమెరికా, చైనా తర్వాత ఆసియాలో ప్రధాన శక్తిగా భారత్ ఎదిగినట్లు నివేదిక

మిగతా 2లో..



నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు..

- దేశ, విదేశీ ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యాలు కలగొద్దు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు
- సమ్మక్క-సారలమ్మ ఆలయ తోరణాల నమూనాలతో అలంకరణ
- ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ప్రత్యేక అవకాశం
- ఎయిర్ షో, ఇతర కార్యక్రమాలను వీక్షించే అవకాశం కల్పించాలి
- ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా ప్రతినిధులకు ప్రవేశం
- అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి
- ప్రతినిధుల కోసం ఫుడ్ కోర్టులు, మెరుగైన ఇంటర్నెట్ సదుపాయం
- ప్రతి ప్రతినిధికి ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్ ఏర్పాటు

హైదరాబాద్, (ప్రజాస్వరం):

గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లన్నీ పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో గ్లోబల్ సమిట్ ఏర్పాట్లపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ విద్యార్థులకు అవకాశం

గ్లోబల్ సమిట్‌లో తెలంగాణ సంస్కృతి, మిగతా 2లో..

కాంగ్రెస్ హామీలన్నీ నీటిమూటలే

2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం: కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని వ్యాఖ్య

ఎమ్మెల్సీ, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

4.71 లక్షల పెన్షన్లకు కోత.. కొత్తగా ఇచ్చింది 4.63 లక్షలే

మహిళలకు నెలకు రూ.2,500 హామీ ఏమైంది?

ఒక్కో మహిళకు రూ.85,500 బకాయి పడ్డారు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అవినీతి, కమీషన్ల బాగోతాన్ని బయటపెడుతున్నారు

మూడేళ్లలో సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారు

వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ హామీ ఏమైంది?

కేసీఆర్ హయాంలోని పథకాలనే కొనసాగిస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారు



హైదరాబాద్, (ప్రజాస్వరం):

కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, 2028లో కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హన్మకొండ కెడిసి గ్రౌండ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు రాబోయే ఎమ్మెల్సీ, కార్పొరేషన్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పెన్షన్లు పెంచామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు వాస్తవాలు మాట్లాడాలని, నాలుగు లక్షల 71 వేల పెన్షన్లు తొలగించి కొత్తగా నాలుగు లక్షల 63 వేల పెన్షన్లు మాత్రమే ఇచ్చిన ప్పుడు పెంచినట్లా.. తగ్గించినట్లా అని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి 36 నెలలు గడిచినా అమలు చేయలేదని, ఒక్కో మహిళకు రూ.85,500 బకాయి పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అవినీతి, 20 శాతం కమీషన్ల వ్యవహారాన్ని బయటపెడుతున్నారని, రాష్ట్రంలో ప్రజాపాలన కాకుండా పర్సంటేజీల పాలన మిగతా 2లో..

డబ్బు లేకపోవడమే పేదరికం కాదు

- ఇల్లు, నీరు అందకపోయినా పేదరికమే
- వైద్య ఖర్చులు కుటుంబాలను కుంగదీస్తాయి
- ఒక్క అనారోగ్యం ఆర్థిక స్థితిని మార్చేస్తుంది
- దశాబ్దంలో పేదరికం తగ్గిందని వెల్లడి
- 50 కోట్ల మంది పేదరికాన్ని జయించారని ప్రకటన
- ప్రపంచబ్యాంకు నివేదికను ప్రస్తావించిన మంత్రి
- సంక్షేమ పథకాలతో మార్పు వచ్చిందని వ్యాఖ్య
- చివరి లబ్ధిదారుడి వరకు పథకాల అమలు
- మహిళల విజయగాథలను వివరించిన నిర్మల
- 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యమని స్పష్టం



హైదరాబాద్, (ప్రజాస్వరం):

డబ్బు లేకపోవడం ఒక్కటే పేదరికం కాదని, ఇల్లు, తాగునీరు, వైద్యం వంటి కనీస అవసరాలు అందుబాటులో లేకపోవడం కూడా పేదరికం కిందకే వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి మిగతా 2లో..

ఆ ముగ్గురు మావోయిస్టులు లొంగిపోవాలి

- అజ్ఞాత నేతలకు డీజీపీ సీవీ ఆనంద్ పిలుపు
- ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని సూచన
- 214 మంది మావోయిస్టులకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ
- మొత్తం రూ.5.59 కోట్ల నగదు అందజేత
- 2024 నుంచి 824 మంది మావోయిస్టుల లొంగుబాటు
- ఇప్పటివరకు 659 మందికి రూ.17.68 కోట్ల సాయం
- మిగిలిన 96 మందికి త్వరలో నగదు జమ
- 57 మందికి ఉచిత వైద్యం కోసం ఆరోగ్య కార్డులు



హైదరాబాద్, (ప్రజాస్వరం):

అజ్ఞాతంలో ఉన్న ముగ్గురు సీనియర్ మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా ఉన్న నేతలు కూడా మిగతా 2లో..



ప్రభుత్వ భూములను అమ్మడం సరికాదు

- వై జంక్షన్ మెట్రో సమీపంలోని హుడా ట్రక్ పార్కింగ్ స్థలం వేలాపై అభ్యంతరం
- ప్రభుత్వ భూములను ఆదాయ వనరులుగా చూడటం తగదు: ఈటల రాజేందర్
- ప్రజావసరాల స్థలాలను వేలం వేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు
- పేదల అసైన్డ్ భూములు, ప్రజా ప్రయోజనాల స్థలాలను పరిరక్షించాలి
- బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా

హైదరాబాద్, (ప్రజాస్వరం):

ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాదిరిగా విక్రయించడం ఎంతమాత్రం సరికాదని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని వై జంక్షన్ మెట్రో వద్ద ఉన్న ఉన్న హుడా ట్రక్ పార్కింగ్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను ప్రభుత్వం ఇలా వేలం వేసుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రజలకు, రాబోయే తరాలకు ఖాళీ స్థలాలే లేకుండా పోతాయని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాల కోసం ఆలోచించాలి తప్ప, మిగతా 2లో..



కాంగ్రెస్‌కు 90 సీట్లు ఎలా వస్తాయి?

- హామీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసిన సంజయ్
- నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500 ఏవని నిలదీత
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా

హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 90 స్థానాలు ఎలా వస్తాయంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. కరీంనగర్‌లో పర్యటించిన ఆయన, పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏం హామీలను సమర్థవంతంగా అమలు చేశారని కాంగ్రెస్‌కు ప్రజలు 90 సీట్లు ఇస్తారు? అంటూ ఆయన నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలపై స్పందిస్తూ, యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చారా? అని సంజయ్ ప్రశ్నించారు. అలాగే అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ఎందుకు అమలు కాలేదని ఆరోపించారు. ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి మిగతా 2లో..

కాంగ్రెస్ హామీలన్నీ నీటిమూటలే

మొదటిపేజీ తరువాయి

సాగుతోందని మండిపడ్డారు.
కాంగ్రెస్ పాలనలో సంక్షేమం సున్నా.. అభివృద్ధి గుండుసున్నా అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు సంవత్సరాల్లో సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసిందని కేటీఆర్ విమర్శించారు. మొదటి ఏడాది లక్షన్నర, రెండో ఏడాది మరో లక్షన్నర, మూడో ఏడాది లక్షా 20 వేల పెన్షన్లు తొలగించారని, మొత్తం 4.71 లక్షల పెన్షన్లకు కోత పెట్టి కొత్తగా 4.63 లక్షల పెన్షన్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రూ.2,000 పెన్షన్‌ను ఇప్పటికీ కొనసాగిస్తూ, కొత్తగా పెన్షన్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.
మహిళలకు రూ.1.50 లక్షలు చెల్లించాలన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 36 నెలలుగా ఆ హామీని అమలు చేయలేదని కేటీఆర్ మండిపడ్డారు. ఒక్కో మహిళకు రూ.85,500 బకాయి పడిందని, ఇతర పెండింగ్ హామీలు కలిపితే చెల్లించాల్సిన మొత్తం రూ.1.50 లక్షలకు చేరుతుందని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కనీసం లక్షాధికారులుగా చేయాలని సవాల్ విసిరారు. మహిళలకు రూ.1.50 లక్షల చొప్పున ఇచ్చి లక్షాధికారులను చేస్తే తాను శాశ్వతంగా రాజకీయాలను వదిలిపెట్టి వెళ్తానని ప్రకటించారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, విద్యార్థులకు రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం వంటి హామీలను కూడా కాంగ్రెస్ విస్మరించిందన్నారు
రాష్ట్రంలో అవినీతి ఏ స్థాయిలో పెరిగిపోయిందో కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలే వెల్లడిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. ఐదు నుంచి పది లక్షల రూపాయల వరకు వసూళ్లు చేస్తున్నారని రాజగోపాల్ రెడ్డి చెబుతుంటే, 20 శాతం కమీషన్ ఇవ్వనిదే పనులు జరగడం లేదని మరో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెబుతున్నారని గుర్తుచేశారు. పారిశ్రామికవేత్తలను బెదిరించి వందల కోట్లు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు, దేవాలయ భూముల వ్యవహారంపై మాజీ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ అవినీతి బాగోతాన్ని బయటపెడుతున్నాయని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కమీషన్ల వసూళ్లలో మునిగిపోయిందని మండిపడ్డారు.
వరంగల్ అభివృద్ధిని మూడేళ్లుగా అటకెక్కించారన్నారు. కేసీఆర్ పాలనలో వరంగల్‌ను రాష్ట్రంలోనే ప్రధాన పారిశ్రామిక, విద్యా, వైద్య, ఐటీ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు పునాదులు వేశామని కేటీఆర్ తెలిపారు. వరంగల్ లో 24 అంతస్తులు, 2,250 పడకలు, 35 వైద్య విభాగాలతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు 90 శాతం పూర్తి చేశామని చెప్పారు. జనగామ, మహబూబాబాద్ ఆసుపత్రుల పనులు కూడా దాదాపు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఆరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మంజూరు చేసి వైద్య విద్యకు పెద్దపీట వేశామని వివరించారు. మడికొండ ఐటీ పార్కులో ఎల్ అండ్ టీ మైండ్‌ట్రీ, సైయెంట్, టెక్ మహీంద్రా, క్వాడ్రంట్ వంటి కంపెనీలను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో కిటెక్స్, గణేశా ఎకోస్పియర్, యంగ్‌వన్ వంటి పరిశ్రమలను తీసుకొచ్చి వేలాది మందికి ఉపాధి కల్పించామన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించామని, రూ.150 కోట్లతో రెండు సమీకృత కలెక్టరేట్లు, ఔటర్ రింగ్ రోడ్డు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.
మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో వరంగల్‌కు ఒక్క కొత్త ఐటీ కంపెనీని, ఒక్క కొత్త పరిశ్రమను తీసుకు రాలేకపోయారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పటికే ఉన్న కంపెనీలు కూడా మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మిగిలిన పనులను కూడా పూర్తి చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకు మాత్రం ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. పేదల కోసం నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించకుండా, మెడికవర్ ఆసుపత్రిని ప్రారంభించడంపై ప్రశ్నలు సంధించారు. ఆ ఆసుపత్రితో ముఖ్యమంత్రి బినామీ సంబంధాలున్నాయన్న ఆరోపణను కూడా ప్రస్తావించారు.
ఫ్యూచర్ సిటీ కాదు.. ఫ్యూచర్ ఉన్న సిటీ వరంగల్ అని అన్నారు. హైదరాబాద్ సమీపంలో కేసీఆర్ ప్రభుత్వం ఫార్మా సిటీ కోసం భూములు సేకరిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దాని పేరు మార్చి ఫ్యూచర్ సిటీ అని ప్రచారం చేసుకుంటోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. నిజమైన భవిష్యత్తు ఉన్న నగరం వరంగల్ అని స్పష్టం చేశారు. వరంగల్‌ను రాష్ట్రంలోనే ప్రధాన పారిశ్రామిక, ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దే బాధ్యతను భవిష్యత్తులో తాను తీసుకుంటానని ప్రకటించారు. ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేయడం ఎవరి ప్రయోజనాల కోసం? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, మంత్రి కుటుంబాలకు చెందిన ప్రైవేట్ విద్యాసంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనం చేయాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.
కాళోజీ కళాక్షేత్రంలో కూడా కార్యాలయమా? అని ప్రశ్నించారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరు మీద 1,217 మంది కూర్చునే సామర్థ్యంతో నిర్మించిన కళాక్షేత్రంలో కూడా కార్యాలయం ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. కవులు, కళాకారులు, రచయితల కోసం నిర్మించిన కళాక్షేత్రాన్ని ప్రభుత్వ కార్యాలయంగా మార్చాలనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వరంగల్ ప్రజల వ్యతిరేకతతోనే ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుందని అన్నారు. కాకతీయుల



కళాతోరణం, కాళోజీ వారసత్వం, వరంగల్ సాంస్కృతిక వైభవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.
సాగునీటి నిర్వహణలోనూ కాంగ్రెస్ వైఫల్యం చెందిందని అన్నారు.గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. దేవాదుల పంపులు, కన్నెపల్లి మోటార్లను సమర్థంగా నిర్వహించి నీటిని వినియోగించుకోవాల్సిన సమయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. చెరువులు, రిజర్వాయర్లను నింపి రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వానికి సరైన ప్రణాళిక, చిత్తశుద్ధి లేవని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి కనిపిస్తున్న సమస్య కేటీఆర్ గడ్డమే అని అన్నారు. ప్రజలు ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ముఖ్యమంత్రి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కేటీఆర్ గడ్డంపై వ్యాఖ్యలు చేయడం మినహా రాష్ట్ర సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కరువు, రైతుల సమస్యలు, నిరుద్యోగం, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలపై ముఖ్యమంత్రికి పట్టింపు లేదన్నారు. బూతులు మాట్లాడటం తప్ప రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేసిందేమీ లేదని విమర్శించారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది

మొదటిపేజీ తరువాయి

సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. సమ్మక్కసారలమ్మ ఆలయంలోని తోరణాల సమూనాలను సమ్మిట్‌లో ఉపయోగించాలని అధికారులకు తెలిపారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే ఎయిర్ షోతో పాటు ఇతర కార్యక్రమాలను వీక్షించే అవకాశం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు కల్పించాలని ఆదేశించారు. ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా ప్రతినిధులకు ప్రవేశం కల్పించాలని, వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతినిధుల కోసం ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయడంతో పాటు మెరుగైన ఇంటర్నెట్ నెట్‌వర్క్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రతి ప్రతినిధికి అవసరమైన సహకారం అందించేందుకు లైజనింగ్ ఆఫీసర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రముఖులకు ఆహ్వానాల బాధ్యత



మంత్రులకు

సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు ఆహ్వానాలు పంపే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యమైన ప్రతినిధులకు ఆహ్వానాలు పంపే బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబులకు అప్పగించాలని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన విశ్వవిద్యాలయాలు సమ్మిట్‌లోని ఎడ్యుకేషన్ పెవిలియన్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అమ్మ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు

- **ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్**
- **సన్యాసం తర్వాత మూడేళ్లకు స్వగ్రామానికి వెళ్లిన యోగి**
- **కాషాయ వస్త్రాలతో తల్లి ఎదుట నిలబడి భిక్ష అడిగిన వైనం**
- **తనను చూసి ఆశ్చర్యపోయిన తల్లి**
- **సన్యాసం ఎందుకు తీసుకున్నావని ప్రశ్నించిన అమ్మ**
- **తన ధర్మం సన్యాసమేనని బదులిచ్చిన యోగి**
- **చివరకు తన నిర్ణయాన్ని గౌరవించిన తల్లి**
- **తొలి గురువు అమ్మేనని గుర్తుచేసుకున్న ముఖ్యమంత్రి**
- **తల్లి ప్రేమకు సాటిలేదని భావోద్వేగ వ్యాఖ్యలు**
- **కష్టాల్లో ఉన్న మహిళలకు అండగా నిలవాలని పిలుపు**
- **ఇటీవల కన్నుమూసిన తల్లి జ్ఞాపకాలను నెమరువేసుకున్న వైనం**

నేషనల్‌బ్యూరో. (ప్రజాస్వరం):

తల్లి ప్రేమకు ఏదీ సాటిరాదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. సన్యాసం స్వీకరించిన మూడేళ్ల తర్వాత తొలిసారి స్వగ్రామానికి వెళ్లి, కాషాయ వస్త్రాల్లో తల్లి ఎదుట నిలబడి భిక్ష అడిగిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. ఇటీవల కన్నుమూసిన తన తల్లి సావిత్రీ దేవి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ 'యోగి కీ పాటీ' పేరుతో ఎక్స్ వేదికగా రాసిన లేఖలో పలు భావోద్వేగ విషయాలను పంచుకున్నారు.
సన్యాసం స్వీకరించిన మూడేళ్ల తర్వాత ఉత్తరాఖండ్‌లోని స్వగ్రామానికి వెళ్లినట్లు యోగి తెలిపారు. కాషాయ వస్త్రాలు ధరించి ఇంటి ముందు నిలబడి భిక్ష అడిగానని గుర్తుచేసుకున్నారు. తన గొంతు విని బయటకు వచ్చిన తల్లి.. కాషాయ వస్త్రాల్లో ఉన్న తనను చూసి తొలుత నమ్మలేకపోయిందని వివరించారు. ఆ సమయంలో తల్లిని భిక్ష పెట్టాలని కోరినట్లు తెలిపారు. తనను చూసి ఆశ్చర్యపోయిన తల్లి.. ''ఎందుకు సన్యాసం తీసుకున్నావు? ఇంట్లో ఏమైనా కొరత ఉందా?'' అని ప్రశ్నించినట్లు యోగి తన లేఖలో రాశారు. అందుకు తాను.. ''అమ్మా.. సన్యాసం నా ధర్మం. యోగి ఆకలి భిక్షతోనే తీరుతుంది. నేను ఇక్కడ ఉండటానికి రాలేదు. భిక్ష అడగడానికి వచ్చాను'' అని బదులిచ్చినట్లు పేర్కొన్నారు. చివరకు తల్లి తన నిర్ణయాన్ని అర్థం చేసుకుని గౌరవించిందని గుర్తుచేసుకున్నారు.

తల్లి ప్రేమకు సాటిలేదు

తల్లి గొప్పతనాన్ని వివరిస్తూ రాముడు వనవాసానికి వెళ్లే సమయంలో తల్లి కౌసల్య ఆశీర్వదించిన ఘట్టాన్ని, కృష్ణుడు మథుర నుంచి గోకులానికి వెళ్లిన సందర్భాన్ని కూడా యోగి ప్రస్తావించారు. ''అమ్మ అందరి స్థానాన్ని భర్తీ చేయగలదు. కానీ అమ్మ స్థానాన్ని మాత్రం ఎవరూ భర్తీ చేయలేరు'' అని పేర్కొన్నారు.
తనకు అక్షర జ్ఞానం నేర్పిన తొలి గురువు తల్లేనని యోగి తెలిపారు. జీవితంలో కొన్ని రుణాలను ఎప్పటికీ తీర్చలేమని, అయితే తల్లులు, మహిళల పట్ల మన బాధ్యతలను మాత్రం నెరవేర్చగలమని పేర్కొన్నారు. తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతను మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపాలని సూచించారు.

కష్టాల్లో ఉన్న మహిళలకు అండగా నిలవాలి

అనాథలుగా, నిరాశ్రయులుగా మిగిలిన తల్లులకు అండగా నిలవాలని యోగి ప్రజలకు పిలుపునిచ్చారు. కష్టాల్లో ఉన్న మహిళల బాధలను అర్థం చేసుకుని వారికి తోడుగా నిలవాలని కోరారు. తల్లి ప్రేమను గుర్తుచేసుకోవడంతోపాటు సమాజంలోని ఇతర తల్లుల పట్ల కూడా బాధ్యతతో వ్యవహరించాలని తన లేఖలో పేర్కొన్నారు.
యోగి ఆదిత్యనాథ్ తల్లి సావిత్రీ దేవి ఈ నెల 20న కన్నుమూశారు. ఆమె మరణం తర్వాత తన తల్లితో అనుబంధాన్ని, సన్యాసం స్వీకరించిన తొలినాళ్లలో చోటుచేసుకున్న ఈ సంఘటనను యోగి మరోసారి గుర్తుచేసుకున్నారు.

ఆసియాలో భారత్ ప్రధాన శక్తి

మొదటిపేజీ తరువాయి

వెల్లడించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాంతీయ నేతల్లో రెండో అత్యంత సమర్థుడైన నాయకుడిగా గుర్తింపు పొందారు.

చైనాతో తగ్గిన అంతరం

ఆసియా దేశాల శక్తి సామర్థ్యాలు, ప్రాంతీయ ప్రభావం ఆధారంగా లోవీ ఇన్‌స్టిట్యూట్ ఏటా ఆసియా పవర్ ఇండెక్స్‌ను రూపొందిస్తుంది. 2025లో 40 పాయింట్లుగా ఉన్న భారత్ స్కోరు 2026లో 0.5 పాయింట్లు పెరిగి 40.5కు చేరింది. దీంతో 2018 తర్వాత చైనాతో భారత్‌కు ఉన్న అంతరం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది.
100 పాయింట్లకు గానూ అమెరికా 78.9, చైనా 73.6 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. భారత్ 40.5 పాయింట్లతో మూడో స్థానాన్ని సొంతం చేసుకుంది.

రక్షణ రంగంలో బలోపేత

ప్రాంతీయ దేశాలతో పెరుగుతున్న రక్షణ భాగస్వామ్యం భారత్ శక్తి పెరగడానికి దోహదపడినట్లు నివేదిక వివరించింది. ఆగ్నేయాసియా దేశాలకు బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం భారత రక్షణ సామర్థ్యాలకు, ప్రాంతీయ ప్రభావానికి బలాన్నిచ్చిందని తెలిపింది. వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో స్థిరమైన సంబంధాలు కూడా భారత్ పురోగతికి తోడ్పడ్డాయని పేర్కొంది.

నాయకత్వంలో మోదీకి గుర్తింపు

ఆసియాలో ప్రభావవంతమైన ప్రాంతీయ నాయకుల జాబితాలో ప్రధాని నరేంద్ర మోదీ రెండో స్థానంలో నిలిచారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తర్వాత అత్యంత సమర్థమైన ప్రాంతీయ నాయకుడిగా గుర్తింపు పొందారు.

ఆ ముగ్గురు మావోయిస్టులు లొంగిపోవాలి

మొదటిపేజీ తరువాయి

కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో గతంలో లొంగిపోయిన 214 మంది మావోయిస్టులకు రూ.5 కోట్ల 59 లక్షల 50 వేల నగదు ప్రోత్సాహకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లొంగిపోయిన వారికి ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సాయం, ఇతర సదుపాయాల వివరాలను వెల్లడించారు.2024 నుంచి ఇప్పటివరకు తెలంగాణలో మొత్తం 824 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని డీజీపీ తెలిపారు. వీరిలో 59 మంది తెలంగాణకు చెందినవారు కాగా, 754 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారని వివరించారు. మరో తొమ్మిది మంది ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందినవారని చెప్పారు. ఇప్పటివరకు 659 మంది మావోయిస్టులకు రూ.17 కోట్ల 68 లక్షల 35 వేల నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు వెల్లడించారు. ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు అందించిన వెంటనే మిగిలిన 96 మందికి కూడా రివార్డు నగదును జమ చేస్తామని చెప్పారు.
లొంగిపోయిన వారిలో తెలంగాణకు చెందిన 57 మందికి నిమ్స్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం పొందేందుకు ఆరోగ్య రక్షణ కార్డులు పంపిణీ చేసినట్లు డీజీపీ తెలిపారు. మరో పది మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, మిగిలిన 49 మందికి స్థలాల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు.
2026లో ఇప్పటివరకు 266 మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. వీరిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు (సీసీఎం), 13 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు (ఎస్‌సీఎం) ఉన్నారని వెల్లడించారు. మరోవైపు కర్రెగుట్టల ప్రాంతంలోని తొమ్మిది డంప్‌ల నుంచి 48 ఏకే47 తుపాకులతో సహా మొత్తం 252 తుపాకులు, 359 బీజీఎల్ షెల్స్‌ను ఈ ఏడాది స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గణపతి సహా ముగ్గురు

తెలంగాణకు చెందిన ముగ్గురు సీనియర్ మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారని డీజీపీ గుర్తుచేశారు. ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి కూడా వారిలో ఉన్నారని తెలిపారు. వారంతా ఆయుధాలు వీడి ప్రభుత్వానికి లొంగిపోవాలని పిలుపునిచ్చారు.
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. 2026 మార్చి 31లోగా మావోయిస్టులు లొంగిపోవాలని కేంద్రం గతంలో గడువు విధించింది. ఈ నేపథ్యంలో మిగిలిన సీనియర్ నేతలు కూడా లొంగిపోతే దేశంలో మావోయిస్టు ఉద్యమం పూర్తిగా ముగిసే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

డబ్బు లేకపోవడమే పేదరికం కాదు

మొదటిపేజీ తరువాయి

నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఒక్క తీవ్రమైన అనారోగ్యం కూడా ఓ కుటుంబాన్ని కటిక పేదరికంలోకి నెట్టేయగలదని అన్నారు. భారత్‌లో 2011 నుంచి 2023 మధ్య దాదాపు 50 కోట్ల మంది పేదరికాన్ని అధిగమించారంటూ ప్రపంచబ్యాంకు నివేదిక వెల్లడించిన నేపథ్యంలో ఆమె లింక్డిన్‌లో సుదీర్ఘంగా స్పందించారు.
పేదరికాన్ని కేవలం ఆదాయంతోనే కొలవలేమని నిర్మల వివరించారు. ఒక వ్యక్తికి సంపాదన ఉన్నప్పటికీ ఇల్లు, స్వచ్ఛమైన తాగునీరు, వైద్యం వంటి ప్రాథమిక సదుపాయాలు అందకపోతే అది పేదరికమేనని పేర్కొన్నారు. ముఖ్యంగా కుటుంబంలో ఎవరికైనా తీవ్రమైన అనారోగ్యం వస్తే వైద్య ఖర్చులు ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తాయని, ఆ కుటుంబం తిరిగి పేదరికంలోకి వెళ్లే ప్రమాదం ఉంటుందని తెలిపారు.
గత దశాబ్ద కాలంలో భారత్ పేదరికాన్ని అధిగమించే దిశగా గణనీయమైన పురోగతి సాధించిందని ఆమె పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, తీసుకున్న చొరవ వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. 20112023 మధ్య దేశంలో దాదాపు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రపంచబ్యాంకు నివేదిక వెల్లడించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.
ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు చివరి లబ్ధిదారుడికి చేరే వరకు ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షిస్తారని నిర్మల తెలిపారు. అంత్యోదయ లక్ష్యంతో స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ముద్ర రుణాలు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించడమే ఈ పథకాల ఉద్దేశమని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలతో ప్రయోజనం పొందిన ఇద్దరు మహిళల విజయగాథలను ఆమె ప్రస్తావించారు. నాగాలాండ్‌లోని కిఫిరే జిల్లాకు చెందిన ఎస్తర్ చిరుధాన్యాలతో తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఆమెను 'లఖ్‌పతి దీదీ'గా పేర్కొన్నారు.పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుష్మితా ఘరాయ్ ముద్ర రుణం సాయంతో తమ కుటుంబానికి చెందిన ముద్రణ వ్యాపారాన్ని తిరిగి నిలబెట్టుకున్నారని నిర్మల వివరించారు. ఇలాంటి ఉదాహరణలు ప్రభుత్వ పథకాలు ప్రజల జీవితాల్లో తీసుకొస్తున్న మార్పును తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.
2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలనతోపాటు ప్రజలకు కనీస అవసరాలు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక భద్రత కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని ఆమె తన పోస్టులో వివరించారు



ప్రభుత్వ భూములను అమ్మడం సరికాదు

మొదటిపేజీ తరువాయి

ఆదాయం కోసం భూములు అమ్మే వ్యాపార సంస్థల్లా వ్యవహరించకూడదని ఆయన హితవు పలికారు. పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములతో పాటు ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ప్రభుత్వం బాధ్యతాయుతంగా కాపాడాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కీలక ప్రాంతాల్లో జరిగిన భూకేటాయింపులపై ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. నియోపోలిస్, గచ్చిబౌలి, ఐడీఎల్, ఎల్లమ్మబండ, భాగ్యనగర్ పరిధిలోని వివాదాస్పద భూముల వ్యవహారాలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌కు 90 సీట్లు ఎలా వస్తాయి?

మొదటిపేజీ తరువాయి


వచ్చారని, తెలంగాణలో బీజేపీకి అధికారం అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని బండి సంజయ్ విమర్శించారు. "చనిపోయిన వారి ఓట్లు తీసేస్తే తప్పా? దేశద్రోహుల ఓట్లను తొలగించడం తప్పా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రధానిని ఎవరు నిర్ణయించాలనేది ప్రజల చేతుల్లోనే ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే రాజకీయ సమరం ప్రారంభమైందని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు



చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై అధికార కాంగ్రెస్ పార్టీ లేదా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.

కృష్ణా జలాలపై మళ్లీ రగడ..

- **అదనంగా 10 టీఎంసీలు కోరిన ఏపీ**
- **ఏపీ డిమాండ్‌ను వ్యతిరేకించిన తెలంగాణ**
- **తాగునీటి కోసం 30 టీఎంసీలు కావాలని పట్టు**
- **నిర్ణయం లేకుండానే వాయిదా పడిన భేటీ**



కృష్ణా జలాల వినియోగంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య మరోసారి వివాదం నెలకొంది. హైదరాబాద్‌లో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (KRMB) త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో నీటి అవసరాలు, కేటాయింపులపై ఇరు రాష్ట్రాలు తమ వాదనలు వినిపించాయి. ఏపీ ప్రభుత్వం మొత్తం 19 టీఎంసీల నీరు కావాలని కోరగా.. తెలంగాణ ప్రభుత్వం వచ్చే ఫిబ్రవరి నాటికి 21 టీఎంసీల నీరు అవసరమని స్పష్టం చేసింది. అయితే, నీటి కేటాయింపులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశం ముగిసింది.

సాగర్‌లో 45 టీఎంసీల నీరు..

నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం మొత్తం 45 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు తెలిపారు. వచ్చే జులై వరకు ఈ నీటిని ఆచితూచి వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసమే జులై వరకు 15 టీఎంసీల నీరు అవసరమని వివరించారు. సాగర్ నీటిని తాగునీటి అవసరాలు, కుడి, ఎడమ కాల్వలకే వినియోగించాలని సమావేశంలో స్పష్టం చేసినట్లు తెలిపారు.
ప్రస్తుతం సాగర్‌లో ఉన్న నీటితో కృష్ణా డెల్టాకు చుక్క నీరు కూడా ఇచ్చే అవకాశం లేదని తెలంగాణ తన వాదనను వినిపించింది. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 15 టీఎంసీలు పోగా మిగిలే 25 టీఎంసీల నీటి వినియోగంపై చర్చిద్దామని సూచించింది. మరోవైపు సాగర్‌లో ఉన్న 45 టీఎంసీల్లో సుమారు 5 టీఎంసీలు ఆవిరి రూపంలో నష్టపోయే అవకాశం ఉందని పేర్కొంది.

పల్నాడు వాటర్ గ్రిడ్‌పై తెలంగాణ ప్రస్తావన..

సమావేశంలో పల్నాడు వాటర్ గ్రిడ్ అంశాన్ని కూడా తెలంగాణ లేవనెత్తింది. దీన



అన్నదానం లో అందరు భాగస్వాములు కావాలి

మనోహరాబాద్ (ప్రజాస్వరం) :

కార్తీక పౌర్ణమి సందర్భంగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ లో గల శ్రీ శ్రీ శ్రీ ఆనందగిరి మహారాజ్ ఆశ్రమం ఆవరణలో గల శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు, అయ్యప్ప స్వాముల భిక్షా కార్యక్రమము & భక్తులకు మహా అన్నదాన మహోత్సవము నిర్వహిస్తున్నట్లు భక్తుడు పురం మహేష తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అర్హులైన పద్మశాలి చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలి

- **అర్హులైన పద్మశాలి చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలి**
- **ప్రజావాణిలో పద్మశాలి సేవా సంఘం వినతి**

రాయికల్, ప్రజాస్వరం :

పట్టణంతో పాటు మండల పరిధిలో నివసిస్తున్న అర్హులైన పద్మశాలి చేనేత కార్మికులకు ప్రభుత్వ పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు భోగ రాజేశం మాట్లాడుతూ.. పద్మశాలి కులానికి చెందిన అనేక మంది చేనేత కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా చేనేత వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వయస్సు పైబడటం, ఆర్థిక ఇబ్బందులు, వృత్తిలో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
ప్రభుత్వం అందిస్తున్న చేనేత పింఛన్ల మంజూరులో అర్హులైన కొందరికి అన్యాయం జరుగుతోందని, ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాయికల్ పట్టణం, మండల పరిధిలోని అర్హులైన చేనేత కార్మికులను గుర్తించి, వారికి ప్రభుత్వ పింఛన్లు మంజూరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.
అలాగే ఇప్పటికే పింఛన్ల మంజూరులో జరిగిన అన్యాయాన్ని పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు కోరారు.
ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ఉపాధ్యక్షులు, దాసరి గంగాధర్,కార్యదర్శి కడకుంట్ల నరేష్ కోశాధికారి ఆడేపు నర్సయ్య, యువజన సంఘ సభ్యులు, అష్టమ వాడ పెద్దలు,రాయికల్ పట్టణ మున్సిపల్ చైర్మన్ కట్కం రవి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు, తెరాస పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, బిజెపి నాయకులు వేముల రాము, పద్మశాలి పాత్రికేయులు మచ్చ శేఖర్, వాసం లింబాద్రి, గంట్యాల ప్రవీణ్ పద్మశాలి కుల బాంధవులు అందరూ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేసిన నాయకులు

రాయికల్, ప్రజాస్వరం :

శ్రీ రాజరాజేశ్వర నాగాలయం కొత్తపేట కార్తీక సోమవారం సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆరోగ్యం తొందరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ దానవేని రామ్ యాదవ్ ఆలయ అర్చకులు చెరుకు రాజేశ్వర శర్మ అలాగే రాయికల్ మండల వివిధ గ్రామాల సర్పంచులు మరియు కొత్త పేట వడ్డెర కాలనీ సర్పంచులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందచేత

ప్రజాస్వరం, మనోహరాబాద్ :-

మనోహరాబాద్ మండలం కొనాయిపల్లి గ్రామంలో దళితులపై దాడి చేసిన గ్రామ సర్పంచ్ మన్నే కళ్యాణ్, వారీ అనుచరులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘం నాయకులు సోమవారం గ్రామంలో గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు రావెల్లి నిరంజన్ దాసు, నర్సింలు, అర్జున్ మాట్లాడుతూ దాడి జరిగి 35 రోజులు అవుతున్న నిందితులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని అన్నారు.న్యాయం కోసం పోరాడుతుంటే అధికారులకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. దళితులపై దాడి చేయడం చట్ట రీత్యా నేరమని అన్నారు.దళితులపై దాడి చేసిన నిందితులు, దళితులపై బెదిరింపులకు పాల్పపడుతున్నారని అన్నరు. న్యాయం జరిగే వరకు ఉద్యమం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ప్రవీణ్, గురుదాసు, మహేష్, గిరిప్రసాద్, మల్లేష్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఇంటికి ఇందిరమ్మ బీమా

ప్రజాస్వరం, మనోహరాబాద్ :-

ప్రతి ఇంటికి ఇందిరమ్మ బీమా అందిస్తామని పోతారం సర్పంచ్ పుట్ట వినోద మహేందర్ అన్నారు. సోమవారం గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ప్రారంభించారు.గ్రామంలోని అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించి, ఆపద సమయంలో కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం ఎంతో ప్రాముఖ్యత కలిగినదనీ కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినప్పుడు కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వారి భవిష్యత్తుకు భద్రత కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మంద యాదగిరి, మన్నే సురేష్, చెలిమేల పవన్ గౌడ్, సంకి శ్రీకాంత్, గ్రామ కార్యదర్శి రజిత మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.







పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంపై కమిషనర్ ఆగ్రహం

- **నీటి కొరత ముప్పు పొంచి ఉంది.. ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలి**
- **పట్టణ పరిశుభ్రతే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలి.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్**

సిద్దిపేట, ప్రజాస్వరం :

పట్టణ పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, రహదారులు, కాలనీలు, పార్కులు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు.
సోమవారం సిద్దిపేట పట్టణంలోని 4, 34వ వార్డుల్లో కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్య పనులు, రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, తాగునీటి సరఫరా పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంపై ఆగ్రహం

మొదట హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటించిన కమిషనర్ రహదారులు, పార్కుల పరిసరాల్లో చెత్త పేరుకుపోయి ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పట్టణంలోని అన్ని రహదారులు ప్రతిరోజూ శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. శానిటరీ అధికారులు, జవాన్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు.
కాలనీ ప్రజలతో కలిసి పర్యటించిన ఆయన రహదారులపై ఇసుక, కంకర, మురం వంటి నిర్మాణ సామగ్రి కుప్పలుగా ఉండటాన్ని గుర్తించారు. వాటిని వెంటనే తొలగించాలని సంబంధిత ఇంటి యజమానులకు సూచించారు.రోడ్లపై నిర్మాణ సామగ్రి ఉంచడం వల్ల పాదచారులు,వాహనదారులకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ సొసైటీ సభ్యులు కమ్యూనిటీ భవనానికి నల్లా కనెక్షన్ మంజూరు చేయాలని కోరగా, సమస్యను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నీటి వృథాపై కఠిన చర్యలు

34వ వార్డులో పర్యటిస్తున్న సమయంలో మంచినీరు వృథాగా ప్రవహించడాన్ని గమనించిన కమిషనర్ వెంటనే సంబంధిత కుళాయిలకు డమ్మీ బిగింపులు ఏర్పాటు చేయించారు. ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్ వంటి నగరాల్లో నీటి కొరత సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని, సిద్దిపేట ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకే నీటిని వినియోగించాలని, కుళాయిలను నిర్లక్ష్యంగా వదిలేయకుండా నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

రోడ్ల ఆక్రమణలు తొలగించాలి

రహదారులపైకి దుకాణ సామగ్రిని తీసుకొచ్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని వ్యాపారులను హెచ్చరించారు. రోడ్లను ఆక్రమించి రాకపోకలకు ఆటంకం కలిగిస్తే మున్సిపల్ సిబ్బంది ద్వారా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మురుగునీటి కాలువలను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు.డ్రైనేజీలను ఆక్రమించడం,మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు సృష్టించే వారిపై జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు.

చెత్త వర్గీకరణపై ప్రజలకు సూచనలు

పట్టణ ప్రజలు తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేర్వేరుగా వర్గీకరించి మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకే అందించాలని కమిషనర్ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై చెత్త వేయరాదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్యం, నీటి సంరక్షణ అనేవి కేవలం మున్సిపల్ అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కమిషనర్ మల్లికార్జున్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శివకుమార్, ప్రజాప్రతినిధి గుదాల శ్రీకాంత్, హౌసింగ్ బోర్డు కాలనీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి వినోదంగా 'శక్తి శాలిని'?

ప్రేమకథా చిత్రం 'సైయారా'తో తొలి ప్రయత్నంలోనే నటనలో పరిణతి చూపించి సినీ ప్రేమికుల్లో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు కథానాయిక అనీత్ పడ్డా. ఇప్పడామె ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'శక్తి శాలిని'. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. మడాక్ ఫిల్మ్ హారర్ యూనివర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో విశాల్ జెత్వా కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా నుంచి ఓ ఆసక్తికర కబురు వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఇటీవలే వార్తలొచ్చాయి. ఇప్పుడు ఈ సినిమా వేసవికి వినోదాన్ని పంచనుందని తెలిసింది. "విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక అంశాలతో పాటు సినిమాలోని ప్రతి అంశాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతున్నారు. ఇది ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించే చిత్రంగా నిలుస్తుంద"ని బాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బెంగాలీ జానపద కథల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో అనీత్ ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం.



'అశోక్', 'జై చిరంజీవ', 'సూర్య సన్ ఆఫ్ కృష్ణన్' చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల లోనూ గుర్తింపు తెచ్చుకున్నారు నటి సమీరా రెడ్డి (Sameera Reddy). తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. బాలీవుడ్ కంటే దక్షిణాది చిత్ర పరిశ్రమ నుంచే తనకు ఎక్కువ గౌరవం, అభిమానుల ఆదరణ దక్కిందని తెలిపారు. హిందీ సినిమాల్లో నటించినప్పటికీ తనను తాను దక్షిణాది నటిగానే భావిస్తానని చెప్పారు. ''దక్షిణాదిలో ఇప్పటికీ అభిమానులు నన్ను ఆప్యాయంగా పలకరిస్తున్నారు. 'సూర్య సన్ ఆఫ్ కృష్ణన్' మూవీలోని మేఘన పాత్రని ఇప్పటికీ గుర్తుపెట్టుకున్నారు. 18 ఏళ్ల తర్వాత కూడా ఇంతటి అభిమానం పొందడం మాటల్లో చెప్పలేను. నేను చేసిన దక్షిణాది సినిమాలు ఎప్పటికీ నా హృదయానికి దగ్గరగా ఉంటాయి'' అని ఆమె వెల్లడించారు.

తన తొలి చిత్రం 'మైనే దిల్ తుఝ్‌కో దియా' (2002) సమయంలో ఎదుర్కొన్న అనుభవాలనూ సమీరా పంచుకున్నారు. ''నా చర్మం తెల్లగా కనిపించడానికి రెండు, మూడు షేడ్లు ఎక్కువగా మేకప్ వేసేవారు. అందం అంటే ఇలాగే ఉండాలి అని ఎవరు చెప్పారు? ఇప్పటికీ ఎంతోమంది మహిళలు సొంత కుటుంబాల్లోనే వివక్ష ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు, అత్తమామలు సైతం 'నువ్వు నల్లగా ఉన్నావు.. లావుగా ఉన్నావు' అంటూ విమర్శిస్తుంటారు. ఇదెక్కడి పద్ధతి?''అంటూ ఆమె ప్రశ్నించారు.

సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'ఆఖ్రీ సవాల్' (Aakhri Sawal) చిత్రంలో ఆమె నటించారు. సమీరా నటిగా మాత్రమే కాకుండా సోషల్‌మీడియా కంటెంట్ క్రియేటర్‌గా, ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కొనసాగుతున్నారు.



తొలి సినిమాతోనే అలాంటి అనుభవం ఎదురైంది



శోభిత వల్లే నేను చాలా నేర్చుకున్నాను..

అక్కినేని హీరో నాగచైతన్య ప్రస్తుతం తన తదుపరి చిత్రం 'వృషకర్మ' ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అక్కినేని వారసత్వం, తాను చేయాలనుకుంటున్న పాత్రలతో పాటు తన భార్య శోభిత ధూళిపాళ గురించి ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. శోభితను తలచుకోగానే తన మనసులోకి వచ్చే మొదటి పదం ప్రేమ అని చైతన్య ఎంతో ఎమోషనల్‌గా చెప్పారు. శోభితలో మీకు బాగా నచ్చే ఒక లక్షణం ఏమిటని ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు నాగచైతన్య స్పందిస్తూ.. ఆమెలో తనకు నచ్చే గుణాలు చాలా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఆమెకున్న డైనమిక్ నేచర్ తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. సంప్రదాయానికి, ఆధునిక ఆలోచనలకు ఆమె ఒక అందమైన కలయిక అని, ఎప్పుడూ కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉంటారని వివరించారు.

ఒక ఉదాహరణ చెబుతూ.. తాము హాలిడేకి వెళ్లినప్పుడు తన దగ్గర ఒక పక్కా ప్లాన్ ఉంటుందని, ఒకవేళ అది వర్కౌట్ కాకపోతే తన మైండ్ ఆగిపోతుందని చైతన్య అన్నారు. కానీ శోభిత మాత్రం వెంటనే పరిస్థితికి తగ్గట్టుగా ముందుకు వెళ్తుందని, ఆమె వల్లే తాను కూడా అనుకోని పరిస్థితులకు తగ్గట్టు మారడం, కొత్త విషయాలు నేర్చుకోవడం అలవాటు చేసుకున్నానని చెప్పుకొచ్చారు. ఆమె కనుక లేకపోతే తాను ఇంతలా మారేవాడిని కాదని అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా.. 'వృషకర్మ' చిత్రాన్ని కార్తీక్ వర్మ దండు తెరకెక్కించగా.. ఇందులో మీనాక్షి చౌదరి, జయరామ్, స్పర్శ్ శ్రీవాస్తవ, సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు.





ఆ రెండు ప్రాజెక్ట్‌స్‌లో చిన్న పాత్రలు చేయడం వల్ల మంచి అనుభవాన్ని పొందా

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ ఇటీవల 'ఆకాశంలో ఒక తార' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి, తన అద్భుతమైన నటనతో విమర్శకులు, అభిమానుల నుండి ప్రశంసలు దక్కించుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. తమిళంలో ట్రైన్, వెట్టువం సినిమాలతో పాటు హిందీలో 'కాల్ మీ బే సీజన్2' వెబ్ సిరీస్‌లో నటిస్తూ క్షణం తీరిక లేకుండా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శృతి హాసన్, ట్రైన్, వెట్టువం ప్రాజెక్ట్‌స్‌లో తన పాత్రల గురించి ఎన్నో ఆసక్తికర విషయాలను అభిమానులతో పంచుకున్నారు. ఈ రెండు సినిమాల్లోనూ తాను పూర్తి స్థాయి ప్రధాన పాత్రలు పోషించలేదని శృతి హాసన్ స్పష్టం చేశారు.

ఈ రెండింటిలోనూ తాను కేవలం అతిథి పాత్రల్లో మాత్రమే కనిపిస్తానని చెప్పారు. ఇలాంటి చిన్న పాత్రలు చేయడం కూడా తనకు మంచి అనుభవాన్ని ఇచ్చిందని తెలిపారు. ముఖ్యంగా 'ట్రైన్' సినిమా కథాంశం, మేకింగ్ చాలా భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'కూలీ' సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలోనే 'ట్రైన్' చిత్రీకరణ కూడా సమాంతరంగా జరిగిందని ఆమె గుర్తుచేసుకున్నారు. దర్శకుడు మిస్కిన్ పనితీరు సెట్‌లో చాలా సరదాగా, ఉత్సాహంగా ఉంటుందని ప్రశంసించారు. ఆయనతో కలిసి పని చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఈ సినిమా తనకు ఒక గొప్ప లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్‌గా నిలిచిపోయిందని శృతి హాసన్ చెప్పుకొచ్చారు.



యంత్రంలా పనిచేయడం నా వల్ల కాదు..

గతేడాది ధనుష్ 'ఇడ్లీ కడై' సినిమాతో నిత్యా మీనన్ ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్‌తో కలిసి 'మిస్టర్ అండ్ మిసెస్ గ్రే' అనే సైకలాజికల్ థ్రిల్లర్ సినిమాలో నటిస్తున్నారు. విశాల్ రంజన్ మిశ్రా, అంకుర్ పజ్ని దర్శకత్వంలో వేవ్‌బ్యాండ్ ప్రొడక్షన్ నిర్మిస్తుండగా.. ఇందులో ఆశిష్ విద్యార్థి, శ్రేయా శర్మ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. మానవ్ అనే వ్యక్తి తన ప్రియురాలి ఒత్తిడితో, తన అక్రమ సంబంధం, ఆర్థిక మోసాలు బయటపడకుండా ఉండేందుకు సొంత భార్యనే హత్య చేయడానికి ప్లాన్ చేసే ఉత్కంఠభరిత కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుంది. ఇక ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిత్యా మీనన్, తాను సినిమాల మధ్యలో ఎందుకు గ్యాప్ తీసుకుంటున్నారో వెల్లడించారు. తన దృష్టిలో సినిమాలే జీవితం కాదని, వృత్తికి మించి ఈ ప్రపంచంలో తెలుసుకోవడానికి, నేర్చుకోవడానికి ఎన్నో విషయాలు ఉన్నాయని ఆమె అన్నారు.

కెరీర్ అనేది జీవితంలో ఒక భాగం మాత్రమేనని, సినిమాలకు దూరంగా ఉన్నప్పుడు ఇంట్లో ఉంటూ కొత్త విషయాలపై దృష్టి పెడతానని తెలిపారు. సహజంగా పెరిగే పువ్వు తన చుట్టూ ఉన్న పరిసరాల నుండి శక్తిని, అందాన్ని గ్రహించినట్లే తాను కూడా బ్రేక్ తీసుకున్నప్పుడు కొత్త ఎనర్జీని పొందుతానని నిత్యా చెప్పారు. ఒక యంత్రంలా విరామం లేకుండా పనిచేయడం తన వల్ల కాదని, కెమెరా ముందు కృత్రిమంగా నటించలేనని స్పష్టం చేశారు. తాను చేసే పాత్రలోని భావోద్వేగాలు మనసు లోతుల్లో నుండి సహజంగా రావాలని, అలా రాకపోతే నటించడం కష్టమని అన్నారు. తెరపై ప్రేక్షకులను మెప్పించడానికి తెరవెనుక ఎంతో మానసిక, శారీరక శ్రమ పడాల్సి ఉంటుందని, ఆ అలసట నుండి కోలుకుని మళ్లీ కొత్త ఉత్సాహంతో తిరిగి రావడానికి తనకు ఆ విరామం కచ్చితంగా అవసరమని నిత్యా మీనన్ చెప్పుకొచ్చారు.

ప్రభుదేవాతో మంచు విష్ణు పాన్‌ఇండియా సినిమా!

ప్రముఖ నృత్య దర్శకుడు ప్రభుదేవా (Prabhu Deva) డైరెక్టర్‌గానూ విజయాలు అందుకున్న సంగతి తెలిసిందే. తెలుగుతో పాటు తమిళం, హిందీల్లో ఆయన పలు చిత్రాలు తెరకెక్కించారు. 2021లో సల్మాన్ ఖాన్ నటించిన 'రాధే'కు దర్శకత్వం వహించిన తరువాత మరో చిత్రం ఆయన నుంచి రాలేదు. ఇన్నేళ్ల విరామం తరువాత ఇప్పుడు మంచు విష్ణుతో (Vishnu Manchu) తదుపరి చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమయ్యారు.

సోమవారం (నవంబరు 23) మంచు విష్ణు పుట్టినరోజు సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ ప్రాజెక్టు గురించి వెల్లడించారు ప్రభుదేవా. "నా హీరో, తమ్ముడు మంచు విష్ణుకు హ్యాపీ బర్త్‌డే. 'ఐఎం 24' (వర్కింగ్ టైటిల్)తో ఈ సంబరాలు మరింత ప్రత్యేకంగా మారాయి" అని ప్రభుదేవా పోస్టు చేశారు. దీంతోపాటు విష్ణుతో కలసి పోజిచ్చిన ఫొటోను పంచుకున్నారు. యాక్షన్ థ్రిల్లర్ కథతో పాన్‌ఇండియా స్థాయిలో ఈ సినిమాను రూపొందించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా కోసం విష్ణు కొత్తగా కనిపించడానికి శారీరకంగా తనను తాను తీర్చిదిద్దుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో నటించే ఇతర తారాగణం వివరాలు తెలియాల్సి ఉంది.



సంగీత పరిశ్రమలో లైంగిక వేధింపులు.. బాధితులు ముందుకు రావాలి



కర్ణాటక సంగీత రంగంలో ప్రసిద్ధి చెందిన వయోలిన్ విద్వాంసుడు హెచ్.ఎన్. భాస్కర్ (H.N. Bhaskar) అమెరికాలో అరెస్ట్ కావడంతో ఒక్కసారిగా వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. మైనర్‌పై లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై గాయని చిన్మయి ఎక్స్ వేదికగా వరుస పోస్ట్‌లు పెట్టారు.

మొదట ఈ వ్యవహారంపై బాధితులకు మద్దతుగా పోస్ట్ పెట్టిన చిన్మయి (Chinmayi).. తర్వాత తనకు బాధితుల నుంచి ఎన్నో మెసేజ్‌లు వస్తున్నాయని తెలిపారు. ''ఈ శాస్త్రీయ సంగీత వయోలిన్ విద్వాంసుడి బాధితుల కథలు చాలా ఉన్నాయి. వాటిని బయటపెట్టే పరిస్థితిలో నేను లేను. వారి కథలను వెల్లడించడం, స్క్రీన్‌షాట్లు పోస్ట్ చేయడం వంటివి చేయలేను. ఈ వ్యక్తి గురించి గతంలోనూ ఆరోపణలు బయటకు వచ్చాయి. అతనితో కలిసి పనిచేసే మహిళలతో సహా కర్ణాటక సంగీత రంగానికి చెందిన వారు ఎవరూ దీనిపై స్పందించలేదు. 'మళ్లీ ఇలాంటిది జరిగితే నాకు చెప్పండి' అని వారంతా బాధితులతో అనే పరిస్థితి ఏర్పడింది''.''బాధితులు చాలా చిన్న వయసు వాళ్లు. ఈ కేసుల్లో కొన్ని పోక్సో చట్టం పరిధిలోకి వస్తాయి. మీకు సరైన న్యాయసహాయం అందేలా చేస్తాను. సానుభూతితో, సున్నితంగా వ్యవహరించే న్యాయవాదుల వద్దకు మిమ్మల్ని తీసుకెళ్తాను. దయచేసి మీరంతా ఒక్కటై ముందుకు వచ్చి కేసు నమోదు చేయండి. మీకు మద్దతు లభిస్తుంది'' అని తన పోస్ట్‌లో చిన్మయి రాసుకొచ్చారు. ఇక ధైర్యం చేసి ముందుకొచ్చిన బాధితులకు కృతజ్ఞతలు తెలిపిన ఆమె.. ఈ వ్యవహారంలో న్యాయం కోసం పోరాడాలని కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999